6

# యుద్ధ విజయముల కాలము

## యొర్దానును దాటినది మొదలుకొని యెహోషువ మరణమువరకు, క్రీ.పూ. 1451-1400 (యెహోషువ 1-24)

### I. యొర్దాను దారి.

**1. క్రొత్త నాయకుడు.** – యొర్దాను తూర్పు తీరాన ఇశ్రాయేలీయులు దిగియుండగా, మోషే ఇశ్రాయేలీయులను విడిచివెళ్లాడు. ఓగు, సీహోనులపై విజయము నదికి తూర్పు వైపుననున్న పీఠభూమిని సంపాదించింది. కనాను సరిగా నదికి పశ్చిమ వైపుననున్నది. పర్వతమయమైన దేశము ప్రాకారములుగల పట్టణములలో యుద్ధ ప్రియులైన జనులతో నింపబడినది కనాను. వారి యెదుట ఉంచబడినది తేలికైనది కాదు. గొప్ప యుగాలకు గొప్పవారు కావాలి. ఇశ్రాయేలీయులకు రెండవ మోషే మరెన్నడూ లేడు. క్రొత్త సందర్భాలు క్రొత్తవారిని ఆహ్వానిస్తోంది. విడిపించడానికి, ఇశ్రాయేలీయులను క్రమబద్ధం చేయడానికి మోషేకు తరుణమిచ్చిన దేవుడే, జయించడానికిని స్థావరాలు ఏర్పరచడానికిని యెహోషువకు అవకాశమిచ్చాడు.

**2. యొర్దాను విభాగింపబడింది.** – వెనుక బలమైన శత్రువు ఒత్తిడి చేస్తూ ఉండగా, ఇశ్రాయేలీయులు ఎఱ్ఱ సముద్రము వద్దకు వచ్చారు. బలమైన శత్రువు నెదుర్కొనే సందర్భంలో వారు యొర్దాను వద్దకు వచ్చి చేరారు. అక్కడ, సముద్రము వద్ద తమ దేవునియందును, తమ నాయకునియందును విశ్వాసము పొంగునట్లు విశేషమైన అద్భుతం జరిగింది. అది కోతకాలం. లెబనాను పర్వతం మీద కరిగి వచ్చే హిమ ప్రవాహమువలన యొర్దాను దిగువ భూములు వరదతో నింపబడతాయి. అక్కడ బోట్లుగాని, బ్రిడ్జిలుగాని లేవు. అయితే పరిశుద్ధమైన మందసము మోయు యాజకుల పాదాలు నది అంచునకు తగలగానే, నీళ్లు విభాగించబడ్డాయి, ఇశ్రాయేలీయులు ఖాళీదైన నది ప్రవాహపు మార్గాన నడిచిపోయారు. ఆ రాత్రి వారు బస చేసిన స్థలములో రెండు జ్ఞాపకార్థ రాళ్ల చిహ్నములను నిలబెట్టారు. నది ప్రవాహపు మార్గమున ఒకటియూ, గిల్గాలులో మరి యొకటియూ ఉంచబడెను.

**3. గిల్గాలులో విడిది.** – ప్రయాణ కాలములో వదలివేసిన సున్నతి అనే కార్యక్రమం సరి క్రొత్తదిగా చేయబడింది. వారి అవిశ్వాసమువల్ల కలిగిన నింద, దాని శిక్షావిధి తొలగింపబడినందున గిల్గాలు అనే పేరు వచ్చింది. నిర్గమపు రాత్రివలెనే ఇక్కడ కూడా పస్కా మరోసారి ఆచరించబడింది. అప్పుడు సంహార దూత ప్రసన్నత ఐగుప్తు దేశంలో

నుంచి దాటిపోయినప్పుడు అక్కడ జనులు భయభీతులు చెందారు; ఇప్పుడు కనానీయులు యెరికో గోడల వెనుక భయకంపితులై క్రుంగిపోతున్నారు. ఇక్కడ మన్నాకూడ నిలిచి పోయింది; ఇక్కడగాని, లేదా బేతేలుకు సమీపాననున్న మరియొక గిల్గాలు వద్ద కాని, కనాను జయింపబడి వారిమధ్య పంపిణీలు వేసికొనేవరకు ఇశ్రాయేలీయులు తమ శిబిరాలను నిలుపుకున్నారు.

## II. యెరికోను స్వాధీనము చేసికొనడం.

యొర్దానును దాటక మునుపే, శత్రువుల దుర్గములను వేగు చూడడానికి యెహోషువ గూఢాచారులను పంపాడు. దేవుని ప్రజల యొక్క భవిష్యత్ విషయమై స్థిరమైన విశ్వాసముగల రాహాబను ఒక స్త్రీ, యెరికోలో ఆ వేగులవారిని దాచి, ఆ పట్టణం స్వాధీనపరచుకొనేటప్పుడు తన యింటి క్షేమాన్ని గూర్చిన అభయాన్ని పొందింది. మోషే తన ఆదేశాన్ని పొందినట్లు, గిల్గాలునందు మజిలీలో యెహోషువ తన ఆదేశాన్ని పొందాడు. అది మండుచున్న పొదలో కాదు, గాని ఒర దూసిన ఖడ్గంతో, యుద్ధ విజయానికి అంతరార్థంగా దైవ ప్రత్యక్షత అతనికి కలిగింది. యెరికోను స్వాధీనపరచుకొనడం అనేది దేవుని పనియేగాని నరుని పని కాదు అనేది యెరికోను ముట్టడి వేసే విధానంలోనే చెప్పబడింది. యెరికో కనానుయొక్క ద్వారం; దాటిపోయే మార్గంలో అది ఉంది. అది వెనుక విడిచి పెట్టబడకూడదు. దాని గోడలను పడగొట్టడానికి ఇశ్రాయేలీయుల వద్ద ఇంజన్లు ఏమీ లేవు. దేవుని ఆజ్ఞనుబట్టి, దానిచుట్టు ఏడుసార్లు తిరిగి, వారు బూర ధ్వనితోను గొప్ప శబ్దము చేయగా గోడలు కూల్చబడ్డాయి, యెరికో వారిదైయింది. ఐగుప్తు యొక్క కాడిని విరుగగొట్టింది యెహోవా, సముద్రం గుండా మార్గాన్ని తెరిచాడు, అరణ్యంలో పోషించి, వారిని నడిపించాడు, ఆయన వారికి తన ధర్మశాస్త్రాన్ని యిచ్చాడు, వారి కొరకు ఆయన యొర్దాను నదిని వేరు చేశాడు. చెడిపోయిన కనానీయులను తొలగదోసి వాగ్దానం చేసిన భూమిని నిబంధన జనులకు యివ్వడం ద్వారా ఆయన తన నిబంధనను నెరవేర్చాడు.

## III. కనాను కేంద్ర ప్రాంతాన్ని జయించడం.

**1. హాయిని పట్టుకొనడం.** – మధ్య కనానుకు హాయి కీలక స్థానంగా ఉంటుంది. మొదటి దాడిలో ఇశ్రాయేలీయులు తరుమబడ్డారు. బంగారు, కొంత వెండిడబ్బు, షీనారు వస్త్రాలు యెరికోలో అపహరించిన ఆకాను పాపాన్ని బట్టి అది జరిగినట్టు కారణాన్ని కనుగొన్నారు. స్వార్థపరమైన పేరాశకు అది సమయం కాదు; తన జీవితాన్ని పోగొట్టు కొనడం ద్వారా తన పాపానికి ఆకాను పరిహారం చెల్లించాడు. హాయిపై రెండవ పోరు హాయిని, కనాను కేంద్ర ప్రాంతాన్ని ఇశ్రాయేలీయుల స్వాధీనం చేసింది.

**2. షెకెము యొక్క కూడిక.** – ఇప్పుడు ఇశ్రాయేలీయులు మధ్య భూ భాగంలో ఉన్నారు. తమ పితరుల యొక్క అడుగుజాడలు వారి చుట్టూ ఉన్నాయి. అబ్రాహాము షెకెములో తొలిగా తన గుడారాన్ని వేసికొని, బలిపీఠాన్ని కట్టాడు. దానికి సమీపంగా

ఉన్న బేతేలులో, పారిపోతున్న యాకోబు దర్శనము పొంది, జ్ఞాపకార్థ చిహ్నాన్ని నిర్మించాడు. అతడు పరదేశంనుండి తిరిగి వచ్చినప్పుడు, అతడు షెకెములో నివసించి, మెసొపొతమియాలోనుండి తన కుటుంబము తీసికొని వచ్చిన విగ్రహ సంబంధమైన వస్తువులను అక్కడ పాతిపెట్టాడు. ఇప్పుడు దేవుని శక్తిచేత, దేవుని నిబంధన నెరవేర్చబడుతుంది, పవిత్రమైన భక్తితో మరల ప్రారంభించడం, నిబంధనకు జ్ఞాపకార్థమైన చిహ్నం ఉంచడం తగియుంటుంది. అందువలన, గతంలో మోషే యిచ్చిన ఉత్తరువునుబట్టి (ద్వితీయో. 27), షెకెములో పవిత్రమైన కూడిక జరిగింది. ఉత్తరాన ఈబాలు పర్వతము, దక్షణమున ఉన్న గెరీజీము మధ్యలోగల సన్నని లోయలో షెకెము ఉంది. ఆ లోయ నడుమన లేవీయులు నిలిచియున్నారు. వారు విధేయులపై దేవుని దీవెనలు ఉచ్చరింపగా, గెరీజీము పర్వతం మీదనున్న ఆరు గోత్రముల వారు "ఆమెన్" అని పలికారు; అవిధేయులమీద వారు శాపములను ఉచ్చరింపగా; ఈబాలునుండి ఆరు గోత్రముల వారు "ఆమెన్" అని పలికారు. అప్పుడు జ్ఞాపకార్థపు చిహ్నము లిఖించబడింది, ధర్మశాస్త్రం నిలుపబడింది, బలుల పండుగ ఆచరించబడింది.

## IV. **ఐక్య కూటమి, దక్షణపు విజయ యాత్ర.**

**1. గిబియోనీయులతో వారు జతకూడడం.** – భూ ఆక్రమణ కాలంలో, మధ్య కనానులో ఉన్న గిల్గాలులో ఇశ్రాయేలీయుల ప్రధాన శిబిరము ఉండేది. హాయి కూలిపోయిన తక్షణమే, హాయికి దక్షణముగా ఉన్న గిబియోనునుండి వర్తమానికులు యెహోషువ యొద్దకు వచ్చి, వారు బహు దూరదేశంనుండి వచ్చినవారైనట్టునూ, తాము కాపాడబడడానికి ఇశ్రాయేలీయులతో జతకూడి యుంటామని తెలిపారు. యెహోషువ అంగీకరించాడు. వారి మోసాన్ని గూర్చి తెలిసికొన్నప్పుడు, వారిని నాశనం చేయకుండాలని పవిత్రంగా ఆ నిబంధనను ఉంచాడుగాని, వారిని "ఇశ్రాయేలీయులకు చెట్లు నరుకువారుగాను, నీళ్లు చేదువారుగాను" నియమించాడు.

**2. బేత్ – హోరోను యుద్ధము.** – గిబియోనీయులు జతకూడడంతో దక్షణ ప్రాంతంలో ఉన్న యెరూషలేము, హెబ్రోను, యార్మూత్, లాకీషు మరియు ఎగ్లోను అనే పట్టణాలు, అటు కాపాడుకొనడానికిని, పైకి ఎగయడానికిని స్నేహంతో సఖ్యమయ్యాయి. యెహోషువతో విన్నపం చేసికొన్న గిబియోనుపై వారు దాడి చేశారు. అతడు రాత్రివేళ సైన్యాలను నడిపి, ఆ కూటమి పైబడి గొప్ప బేత్ – హోరోన్ యుద్ధంలో వారిని ఓడించాడు. అది వన్నెకెక్కిన "దీర్ఘ దినం" ప్రాచీన పద్యాన్నిబట్టి, యెహోషువ ఆజ్ఞనుబట్టి సూర్య చంద్రులు నిలిచి పోయారు (యెహోషువ 10:12, 13).

## V. **ఐక్య కూటమి, ఉత్తరపు విజయ యాత్ర .**

కనానీయులు మరొక మారు కలిసి కట్టుగా ప్రయాసపడ్డారు. ఉత్తరాన హాసోరు రాజైన యాబీను వారి ఐక్య కూటమికి నాయకత్వం వహించి మేరోము వద్ద యెహోషువను ఎదుర్కొనగా, అతడు వారిని అక్కడ ఓడించాడు. కలసి కట్టుగా యిచ్చిన ప్రతిఘటనను

యిది అంతం చేసింది. పోరాటం నెమ్మదిగా స్థానికమైన పోరాటాలకు దిగివచ్చి, కొన్ని గోత్రములవారే విజయ యాత్రను వివరాలతో ముగించారు. దేవుడు ఆదేశించిన మేరకు పని సమగ్రమైన విధంగా జరగలేదు, అయితే అది వారి దేశీయ (జాతీయ) జీవన విధానానికి అత్యవసరమైయుంది. వారి అపాయము యితరులతో జత కూడడం, స్నేహ బంధం, వివాహ బంధం అనేవాటిలో ఉంది. వారి క్షేమం, పవిత్రమైన వారి మతం, వారు సంపూర్ణంగా వేరై యుండడంలో ఉంది. కనానీయులను వారు వెళ్ల గొట్టడంలో తప్పిపోయిన పరిస్థితి తరువాత కాలంలో ప్రధాన పాత్ర వహిస్తుంది.

## VI. భూ విభజన, యెహోషువ మృతి.

**1. భూ విభజన.** – ఐక్య ప్రతిఘటన, అసాధ్యమైనట్టు రుజువు చేసి, పన్నెండు గోత్రముల వారికి చీట్లువేసి యెహోషువ భూ భాగాన్ని వారికి పంచి యిస్తాడు. భూమి పంపకంలో లేవీయులు ఒక గోత్రముగా పరిగణింపబడలేదు, అయితే కనాను అంతటిలో పంపకం చేయబడినట్లు నలభై ఎనిమిది పట్టణాలను వారు పొందారు. వీటిలో ఆరు ఆశ్రయ పురాలున్నాయి, అవి; తూర్పున రామోతు–గిలాదును, గోలానును; బేసెరును, పడమట–కాదేషు, షెకెము, హెబ్రోనును నియమించిరి. యోసేపు కుమారులిద్దరిని యాకోబు పెంచుకున్నాడు. అలాగున, లేవీ లేకుండగనే, ఎఫ్రాయిము, మనష్షేలతో పన్నెండు గోత్రాలౌతాయి. వారు రూబేను, షిమ్యోను, యూదా, ఇశ్శాఖారు, జెబూలూను, దాను, నఫ్తాలి, గాదు, ఆషేరు, ఎఫ్రాయిము, మనష్షే, మరియు బెన్యామీను అనువారు.

**2. యెహోషువ వీడ్కోలు, మరణము.** – ఐగుప్తులోను, ఎర్ర సముద్రంలోను జరిగిన అద్భుతాలను కన్నులారా చూచినవారి తరము కంటే యెహోషువ ఎక్కువ కాలం బ్రతికాడు. కాలేబు, యెహోషువలను మినహాయించి, వారు అరణ్యములోనే నశించారు, అతడు మాత్రం నూట పది ఏండ్ల ప్రాయంవరకు బ్రతికాడు. కడవరకు దేవుడైన యెహోవాకును, ఆయన నిబంధనకును నమ్మకముగా ఉన్నవాడై, మరొకమారు షెకెములో గోత్రముల యొక్క కూడికను భక్తి శ్రద్ధలతో పిలుస్తాడు. అక్కడ వారి చరిత్రను తిరిగి జ్ఞాపకం చేస్తూ, భ్రష్టత్వం యొక్క అపాయాన్ని గూర్చి వారిని హెచ్చరిస్తాడు. "యెహోవాను సేవించుట మీ దృష్టికి కీడని తోచినయెడల మీరు ఎవని సేవించెదరో, ... మీరెవరిని సేవింపకోరు కొనినను నేనును నా యింటివారును యెహోవాను సేవించెదము అనెను" (యెహోషువ 24:15). అలాటి గంభీరమైన మాటలతో అటు వారిని, యిటు తన యింటిని దేవుని సేవించడానికి అప్పగిస్తాడు. అప్పుడు రాతితో జ్ఞాపక చిహ్నాన్ని నిలపడంతో జాతీయ నిబంధనను తిరిగి క్రొత్తదిగా చేసి, ఆ సమాజ కూడికను పంపివేసి, అతడు తన పితరుల వద్దకు చేర్చబడతాడు.